క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత


బాధితులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి

పెద్దకడబూరు: విద్యుదాఘాతంతో సర్వం కోల్పోయిన బాధితుడు మంచోది శాంతిరాజు కుటుంబానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ రఘురాముడు రూ. 2,500, దొడ్డిమేకల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రూ. 2,000 అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డితో మాట్లాడి ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాన్ని ఆదుకునే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, విజయేంద్రరెడ్డి, శివారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను తెలుసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: విద్యార్థినులు చట్టాలను తెలుసుకోవాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీఎస్పీ సోమన్న ఆదేశాల మేరకు విద్యార్థినులకు అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మన్న పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

ఆదోని అర్బన్: లయన్స్ క్లబ్ ఆదోని శాఖ ఆధ్వర్యంలో మిత్ర ఎంటర్ ప్రైజస్ జితేంద్ర, లలిత వారి తల్లి పార్వతమ్మ జ్ఞాపకార్థం శనివారం నిరుపేదలకు వివేకానంద సంస్థ ద్వారా బియ్యం, కందిబేడలు, వంటనూనె పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, క్లబ్ అధ్యక్షులు ధర్మారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ప్రసాద్

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని అన్ని పంచాయతీల్లో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కోటేకల్ పంచాయతీ బోడబండ గ్రామంలో మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమంలో భాగంగా గృహ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏమైనా సందేహాలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ బంగారమ్మ పాల్గొన్నారు.

బదిలీ ఏపీపీకి ఘన సన్మానం


గోపాలకృష్ణను సత్కరిస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏపీపీగా పనిచేస్తూ కర్నూలు కోర్టుకు బదిలీ అయిన గోపాలకృష్ణను శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు ఏపీపీ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘురాం, జగన్నాథరెడ్డి, మురళీకృష్ణ, సుధాకర్, సాల్మాన్, యేసేపు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి డిబేట్‌కు ఎంపిక


ప్రణయ్ కుమార్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పూజారి ప్రణయ్ కుమార్ రెడ్డి జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర -2047 డిబేట్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. విద్యార్థిని తోటి విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం అభినందించారు.

సరైన వేళకు బస్సులు నడపండి

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి వెళ్లే విద్యార్థుల కోసం నిర్ణీత వేళల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్‌వీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లారెడ్డి యాదవ్ కోరారు. సిరాళ దొడ్డి గ్రామానికి సరైన వేళకు బస్సు నడపడంలేదంటూ శనివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సంబంధిత అధికారులతో విద్యార్థులు వాగ్వాదానికి దిగారు. విద్యార్థులకు ఇబ్బందిలేకుండా బస్సులు నడుపుతామని అధికారులు హామీ ఇచ్చారు.


గోనెగండ్ల ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మంత్రాలయంలో ప్రాయశ్చిత్త పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు


కోసిగిలో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ ఈరన్న,నాడుగేని నాగరాజు


కందుకూరులో ఆలయంలో పూజలు చేస్తున్న మండల కన్వీనర్ బెట్టన గౌడ


కౌతాళం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

స్వామీ.. చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించు!

- ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల పూజలు
- టెంకాయల సమర్పణ
- రాజకీయ ప్రయోజనాల కోసమే లడ్డూపై టీడీపీ దుష్ప్రచారం


ఎమ్మిగనూరులోని శ్రీవెంకటసాయి ఆలయం వద్ద లడ్డూలు చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గర్జిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు


బనవాసి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, నాయకులు

హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్న చంద్రబాబు

ఆదోని సెంట్రల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ కల్తీ జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్నాడని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మధుసూదన్ అన్నారు. శనివారం తిరుమల నగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని ప్రాయశ్చిత పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ నీ రాజకీయ లబ్ధి కోసం ఎదుటి వారి మీద నిందలు వేయడం బాబుకు పరిపాటిగా మారిందన్నారు. వ్యక్తిగతంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎదుర్కొనలేక ఇలాంటి కుటిల రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ప్రజలను రెచ్చగొట్టి కుల మతాల మధ్య చిచ్చుపెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి జరగని దానిని జరిగినట్లు ఎలా చెప్పగలుగుతున్నావని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చంద్ర కాంత్ రెడ్డి, వెంకటేష్, గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి నాయకులు కుటిల రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కరించే దిశగా చర్యలు చేపడితే బాగుంటుందన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: కలియుగ దైవం తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసేలా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సద్బుద్ధిని ప్రసాదించు స్వామి.. అంటూ శనివారం పట్టణంలోని శ్రీవెంకటసాయి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపప్రక్షాళన పూజలు చేసి, 101 టెంకాయలు కొట్టారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, యువ నాయకుడు బుట్టా ప్రతుల్, పార్టీ వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, ఎంపీపీ కేశన్న తదితరులు ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు గద్దెనెక్కి వంద రోజులైనా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ లాంటి హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందు కేంద్రానికి సహకరించడం, విజయవాడ వరదలకు తాను కారణమైనప్పటికీ వాటిని పక్కదారి పట్టించేందుకు స్వామి వారి లడ్డుపై విషప్రచారం చేసేందుకు పూనుకున్నాడన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తిరుపతి వెంకన్న లడ్డును కల్తీ నెయ్యితో తయారు చేశారంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు వేస్తూ కుట్ర చేస్తున్నారన్నారు. నెయ్యిలో కల్తీ ఉంటే సీబీఐకి కేసు అప్పగించాలని, ప్రభుత్వ సిట్ దర్యాప్తునకు ఆదేశించి తన తప్పును పక్క దారిపట్టించేందుకు ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, శాప్‌నెట్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ యూకే రాజశేఖర్, నందవరం మండల కన్వీనర్ శివప్పగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, పార్టీ నాయకులు గడ్డం నారాయణరెడ్డి, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, విరూపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, పాలశ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, సర్పంచ్‌లు రంగస్వామి, లక్ష్మన్న, నాగిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జ్‌లు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: బనవాసి గ్రామంలో మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిపించగా, దైవందిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నాయకులు ప్రత్యేక పూజుల చేపట్టారు.

గోనెగండ్ల : తిరుమల పవిత్రతను మంట గలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆంజనేయ స్వామి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కో ఆప్షన్ మెంబర్ బందేనవాజ్ కోరారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఆంజనేయస్వామి దేవాలయంలో చంద్రబాబుకు మంచిబుద్ధి ప్రసాదించాలని వైఎ స్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కా ర్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద్, ప ద్మనాభం, కొండల్ బందెనవాజ్, ముళ్ల హుసేన్ వ లి,రంగస్వామి, నాగప్ప, నదిముల్లా తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

ఆదోని టౌన్: స్వామి... వెంకటేశ్వర స్వామి... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి మంచి బుద్ధిని ప్రసాదించు అంటూ శనివారం ఉదయం ఆదోని పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం , ఇందిరానగర్‌లో వెలిసిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. లడ్డూ ప్రసాదం కల్తీకి కారకులైన వారిని శిక్షించాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, కౌన్సిలర్లు చలపతి, నరసింహులు, సురేష్, మహాలక్ష్మి, నాగేంద్ర తదితరులు స్వామివారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఇందిరానగర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు టీటీడీ దేవస్థానంలోనూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని శ్రీ గర్జిలింగేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మెడికల్ నాగరాజు, హనుమంతప్ప, గర్జప్ప, కర్రెప్ప, మల్లిరెడ్డి, బండితిమ్మప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని పెద్దహరివాణంతో పాటు పెద్దతుంబళం, సంతెకూడ్లూరు, చిన్నహరివాణం, విరుపాపురం, ధణాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం ఇలా 14 గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూజలు చేసి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుళ్లను వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధప్ప, కుప్పలదొడ్డి మార్లింగప్ప, మల్లప్ప, మీసేవ నాగరాజు, గోరవ పంపన్న, పరమేష్, తిప్పన్న, చంద్రారెడ్డి, రవి, కపటి రంగస్వామి, లింగన్న, నాగరాజు, హుసేని తదితరులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త పూజలు

మంత్రాలయం : పవిత్ర వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి అపవిత్రను మూటగట్టిన చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో ప్రాయశ్చిత్త పూజలు చేపట్టారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు గావించారు. మంత్రాలయం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేయించారు. కార్యక్రమంలో సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచు హోటల్ పరమేష్, వైఎస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి, నాయకులు గోరుకల్లు కృష్ణస్వామి, శివకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ ప్రాయశ్చిత్తం చేసుకోండి

కౌతాళం: చంద్రబాబూ ఇకనైనా ప్రయశ్చిత్తం చేసుకోండి అంటూ తిరుమల లడ్డూ వివాదంపై వైఎస్సార్‌సీపీ నాయకులు వివిధ గ్రామాల్లో ప్రాయశ్చిత పూజలు చేపట్టారు. మండల కేంద్రమైన కౌతాళంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం పాల్గొన్నారు. నదిచాగిలో ఎంపీటీసీ లింగన్నగౌడ్ ఆధ్వర్యంలో, గుడికంబాలిలో సర్పంచ్ సిద్దేశ్ ఆధ్వర్యంలో,బంటకుంటలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, కుంటనహాల్‌లో కులమతలకు అతీతంగా తరలివచ్చి పూజలు చేశారు.కుంబళనూరులో స ర్పంచ్ వీరేష్,కుంబళనూరు క్యాంపు–1లో అనిల్ ఆధ్వర్యంలో,గోతులదొడ్డి, ఓబుళపురంలో,చూడిలో ఇలా మండలంలోని ప్రతి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతరాముల, మారెమ్మ ఆలయాల్లో చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, వెంకటరామిరెడ్డి, అబ్దుల్‌సమద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

కోసిగి మండలంలోని వివిధ ఆలయాల్లో పూజలు

కోసిగి: మండలంలోని వివిధ ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఎంపీపీ ఈరన్న, మండల నాయకుడు నాడుగేని నాగరాజు, కందుకూరు గ్రామంలో శాంభవిదేవి ఆలయంలో పార్టీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, డి. బెళగల్‌లో తిరుమలేశ్వర స్వామి ఆలయంలో దొడ్డి నరసన్న, వందగల్లు గ్రామంలో కాల్వ లక్ష్మయ్య, దుద్ది గ్రామంలో నాగేష్ , ఆర్లబండ, సజ్జలగుడ్డం, అగసనూరు, కామన్‌దొడ్డి, మూగలదొడ్డి, దొడ్డి బెళగల్, పెద్ద భూంపల్లి, సాతనూరు, కొల్మాన్‌పేట, జంపాపురం, చిర్తనకల్లు, కడదొడ్డి, ఐరన్‌గల్లు గ్రామాల్లో కొలువుతీరిన ఆలయాల్లో పూజలు చేపట్టారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి

పెద్దకడబూరు : కల్తీబాబు ప్రతిపక్షపార్టీపై దుమ్మెత్తి పోసే కార్యక్రామానికి స్వస్తి పలికి కాస్త రాష్ట్ర అభివృద్ధిపై దృషి సారించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి హితువు పలికారు. తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ఆరోపణలు చేయడంతో.. ఆయనకు దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ శనివారం మండల పరిధిలోని తారాపురం గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయ స్వామి ఆలయంలో పాపపక్షాళన పూజలు చేపట్టారు. అనంతరం విలేకరులతో ట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టి 100రోజులు దాటినా ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదన్నారు. ప్రజలకు తాము ఏమి చేశామో చెప్పుకోవడానికి లేకనే కూటమి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఇలాంటి విషపూరిత కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మ్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు కౌశిక్‌స్వామి, రవిచంద్రరెడ్డి, విజయేంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, జాము మూకయ్య, పూజారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.


నదిచాగిలో పూజలు


కుంటనహాల్ గ్రామంలో మతసామర్యసంతో పూజలు


తారాపురం గిడ్డాంజనేయస్వామి ఆలయం వద్ద వెఎస్సార్ సీపీ నాయకులు


ఇందిరానగర్‌లో వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పూజల అనంతరం మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి

కందిలో మారుకా మచ్చల పురుగు

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది పంటకు ప్రస్తుతం మారుకా మచ్చల పురుగు ఆశించినట్లు గుర్తించామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో కంది పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దీనినే బియ్యం పురుగు, గూడు పురుగు, చుట్టు పురుగు అని అంటారన్నారు. ఈ పురుగు ఆకులను, పూతను చుట్టగా చేసుకొని పంటకు తీవ్ర నష్టం కలిగిస్తుందని చెప్పారు. దీని నివారణకు ప్రాఫినోఫాస్ 2 మిల్లీ లీటర్లు లేదా ఏమామెక్టిన్ బెంజోయేట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ 1మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలుపుకొని సాయంత్రం వేళల్లో మొక్క పైభాగం, ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవలన్నారు.


కంది పైరుకు ఆశించిన మారుకా మచ్చల పురుగు

క్రమశిక్షణతో కూడిన చదువులకే మంచి భవిష్యత్తు

ఎమ్మిగనూరుటౌన్: క్రమ శిక్షణతో కూడిన చదువులకే మంచిభవిష్యత్ ఉంటుందని..చదువును ఇష్టంతో కష్టపడి చదవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. విద్యార్థి దశలో బాలబాలికలకు సోషల్‌మీడియా వాడకం, చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై శనివారం స్థానిక మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక భవిష్యత్ ప్రణాళికతో పాటు ఒక లక్ష్యం అనేది వుండాలన్నారు. అప్పుడే చదువుల్లో రాణించగలరని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి, హెచ్‌ఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

విద్యార్థులకు బంగారు పతకాలు

ఆదోని అర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. శనివారం స్థానిక బ్యాంకు ఆవరణలో రాయచోటి రామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఐఆర్‌ఎస్ అధికారి సమీర్‌రాజా, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఎడ్, ఇంజినీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సులలో అత్యధిక మార్కులు సాధించిన 51 మంది విద్యార్థులకు బ్యాంకు తరఫున 24 క్యారెట్స్ ఒక గ్రాము బంగారు పతకాన్ని అందించారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, బ్యాంకు గోల్డ్ మెడల్ ఎడ్యుకేషనల్ కన్వీనర్ మరియు బ్యాంకు డైరెక్టర్ ఆర్‌ఎంజీ రెడ్డి, బ్రాంచి మేనేజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి స్వర్ణపతకాలు

ఎమ్మిగనూరుటౌన్:స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏలో ప్రథమ శ్రేణిలో మార్కులు సాధించిన పట్టణానికి చెందిన రాఘవేంద్రరావు, సుజాత దంపతుల కుమార్తె వి.రూప లావణ్యకు, బీఎస్సీలో ప్రతిభ చాటిన ఎం.మల్లికార్జునల స్వర్ణ పతకాలు దక్కించుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు సూపరింటెండెంట్ మద్దిలేటి, అధ్యాపకులు అభినందించారు.


విద్యార్థినికి బంగారు పతకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే, ఐఆర్ఎస్ అధికారి

మతాలను రెచ్చగొట్టడం మానుకోవాలి


భగత్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రజాస్వామ్య దేశంలో మతాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే కుటిల రాజకీయాలను మానుకోవాలని ఏఐవైఎఫ్ మాజీ పట్టణ కార్యదర్శి సుదర్శన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి అన్నారు.శనివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో తిమ్మారెడ్డి బస్టాండ్ సర్కిల్‌లో భగత్ సింగ్ 117వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో కొన్ని పార్టీలు మతా లు, కులాలు మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బసాపురం గోపాల్, ఏఐవైఎఫ్ నాయకులు అంజిత్ గౌడ్, రమేష్, నాయకులు మోహన్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ఆదోని రూరల్ /ఎమ్మిగనూరుటౌన్/నందవరం/కోసిగి/కౌతాళం: భగత్ సింగ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదోనికి డీవైఎఫ్ఐ సీనియర్ నాయకులు రామ నాయుడు, పట్టణాధ్యక్షులు వీరేష్, ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో, సీపీఐ కార్యాలయంలో, ఐటీఐ కళాశాలలో, కోసిగి సీపీఐ కార్యాలయ ఆవరణలో, కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో, నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతిని హెచ్‌ఎం అలిమ్ సిద్ధిఖీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందించారు. ప్రసాద్, సుధాకర్ బాబు, జాన్ విక్టర్ రాజు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్‌లో చేరిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఆదోని రూరల్: మహిళలపై జరుగుతున్న దా డులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ పిలుపునిచ్చారు. శనివారం సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకప్ప, ప్రసాద్, రాజు, మణి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గోనెగండ్ల : మండల కేంద్రానికి చెందిన ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ గంగాధర్ శనివారం తెలిపారు. శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయం వెనుక పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో ఐదు గురిని అరెస్టు చేసి వారి దగ్గర నుంచి రూ.5,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చీపురు పట్టిన ప్రత్యేకాధికారి

ఆదోని రూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ప్రత్యేక అధికారి ఎస్.నూర్జహాన్ ఆధ్వర్యంలో రాయచోటి సుబ్బయ్యకాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్మికులతో కలిసి ఆమె చీపుర పట్టి శుభ్రం చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.